ప్రజాశక్తి

మంగళవారం 3 సెప్టెంబర్ 2024   8 పేజీలు



గుంటూరు



పల్నాడు



కొల్లిపర మండలంలో పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



తుళ్లూరు మండలం రాయపూడి, పెదలంకను చుట్టుముట్టిన వరద నీరు

వరద గండం

- వదలని ముంపు - తొలగని భయం
- జలదిగ్బంధంలో కృష్ణానది తీరప్రాంత గ్రామాలు
- రెండు లక్షల ఎకరాల్లో పైర్లు మునక
- అమరావతి, తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర మండలాల్లో జనం అవస్థ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భారీ వర్షాలు, వరద ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏర్పడిన ముంపు సమస్య మూడో రోజైన సోమవారమూ కొనసాగింది. లంక గ్రామాలు జలదిగ్భంధనంలోనే ఉన్నాయి. దాచేపల్లి, మాచవరం, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర మండలాల్లో వరద ఉధృతికి లంక గ్రామాలు జలదిగ్భంధనంలో ఉన్నాయి. కృష్ణానదికి సమీపంలో ఉన్న తాడేపల్లి పట్టణంలోని మహానాడు, సుందరయ్యనగర్ ఇళ్లల్లోకి ఐదడుగుల మేర వరద నీరు చేరడంతో స్థానికులు చేతికందిన కొద్దిపాటి సామాన్లు తీసుకుని ప్రాణాలతో బయటపడ్డారు. ముంపునకు గురైన ప్రాంతంలో సుమారు ఏడు వేల మంది నివాసం ఉంటున్నారు. ఇక్కడ 23 లైన్లలో ఎక్కడ చూసినా వరద నీరే కనిపిస్తోంది. ప్రజల రాకపోకలకూ వీల్లేకుండా పోయింది. అందరూ డాబాల పైకిఎక్కి సురక్షితంగా ఉండగలిగారు. సీతానగరం పుష్కర ఘాట్ల పైకి వరద నీరు పెద్దఎత్తున వచ్చి చేరింది. సీతానగరం రామాలయం ఎదురుగా గల కృష్ణానదిలో ఉన్న శివలింగం వరద ఉధృతికి మునిగింది. రైల్వే బ్రిడ్జిని తాకడానికి అడుగు దూరంలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. పైనుంచి వస్తున్న వరదకు కృష్ణానదిలో నుంచి నాలుగు ఇసుక బోట్లు కొట్టుకువచ్చాయి.

కృష్ణానది మునుపెన్నడూ లేని విధంగా ఉగ్రరూపం దాల్చడంతో బ్యారేజీపై రాకపోకలు నిలిపివేశారు. ఉండవల్లి సెంటర్, అమరావతి కరకట్ట రోడ్డు, ప్రకాశం బ్యారేజీ వైపు ఎవరినీ వెళ్లనీయకుండా పోలీసులు కట్టుదిట్టం చేశారు. గత 30 ఏళ్లలో ఇంత పెద్దఎత్తున వరద ప్రవాహం తాము చూడలేదని పెద్దలు చెబుతున్నారు. నాలుగు రోజులుగా పనులు కోల్పోయి, ఇంట్లోని వస్తువులు నష్టపోయి కోలుకోలేని విధంగా నష్టపోయామని బాధితులు వాపోతున్నారు. దాచేపల్లి నుంచి కొల్లిపర వరకు పొలాలన్నీ నీట మునిగాయి. భారీగా కురిసిన వర్షాలతో రైతులు నిండా మునిగిపోయారు. కాకుమాను మండలంలోని కొండపాటూరులో అప్పాపురం డొంక దగ్గర నల్లమడుగు వాగు గండిపడటం వల్ల పంట పొలాలు పూర్తిగా నీటమునిగి పొలాలు జలాశయాలుగా మారిపోయాయి. ఇప్పటికే ఎకరాకు రూ.15 వేలు ఖర్చు పెట్టి సాగు చేసిన వరిపైరు నీట మునిగింది. మొత్తం పైరంతా నీటిలో ఉండిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

ప్రకాశం బ్యారేజికి రికార్డు స్థాయిలో వరద పోటు కొనసాగుతోంది. 1903, 2009లో వచ్చిన భారీ వరద రికార్డులను అధిగమిస్తూ సోమవారం 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. రాత్రి 10 గంటలకు ఈ వరద దాదాపు 40 వేల క్యూసెక్కులు తగ్గింది. ఎగువ నుంచి 11.14 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. 1903లో 10.60 లక్షల క్యూసెక్కుల వరద నీరు రాగా 2009 అక్టోబరు 5వ తేదీన 10.94 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఈ రికార్డులను అధిగమిస్తూ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు 11.44 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. తరువాత క్రమంగా వరద ఉధృతి తగ్గుతూ వచ్చింది. రాత్రి 10 గంటలకు 11.14 లక్షల క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజికి వస్తోంది.

బ్యారేజికి 11 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం రావడంతో కృష్ణానది పరివాహక గ్రామాల ప్రజలు ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియక భయపడ్డారు. కరకట్టపైకి వరద నీరు వస్తుందని తెలిసి అధికారులు ఎక్కడికక్కడ ఇసుక బస్తాలతో ఉధృతిని బయటకు రాకుండా నిరోధించారు. పలుచోట్ల స్వల్పంగా గండ్లు పడిన ప్రాంతాల్లో ఇసుక బస్తాలతో తాత్కాలికంగా పూడ్చివేశారు. వెంకటపాలెంతో పాటు కరకట్ట వెంబడి

2లో



కొల్లిపర మండలంలో సహాయక చర్యలు





కరకట్ట వెంబడి గ్రామాల్లో మంత్రుల పరిశీలన

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని నదీపరివాహక గ్రామాలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం పరిశీలించారు. కరకట్టల వెంబడి ఉన్న వల్లభాపురం, అత్తలూరువారిపాలెం, హనుమాన్‌పాలెంలో వరద ఉధృతిని పరిశీలించారు. హనుమాన్ పాలెం వద్ద కరకట్టను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి పరిశీలించి అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కట్ట బలహీనంగా ఉన్నచోట్ల ఇసుక బస్తాలు వేసేందుకు స్థానికులు ప్రయత్నిస్తుండగా ఆ పనుల్లోనూ మంత్రి మనోహర్ కొద్దిసేపు సాయం చేశారు. మరో రెండ్రోజులపాటు అధికారులతోపాటు ప్రజలూ అప్రమత్తంగా ఉండాలని, బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు.



తాడేపల్లి మహానాడులో నీటమునిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు...
అమరావతి పునరావాస కేంద్రంలోని వారితో మాట్లాడుతున్న నాయకులు



పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి నిరసన

ప్రజాశక్తి-గుంటూరు



నిరసనలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

పాలస్తీనాపై సంవత్సర కాలంగా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధోన్మాద దాడులను వ్యతిరేకంచాలని, అమెరికా సామ్రాజ్యవాద విధానాలను విడనాడాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని సోమవారం సాయంత్రం గుంటూరు శంకర్‌విలాస్ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. 'యుద్ధాలు వద్దు-ప్రపంచ శాంతి కావాలి' అనే నినాదంతో కార్మికవర్గం అంతా పాలస్తీనాకు సంఘీభావం తెలియచేయాలని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌టియు) పిలుపులో భాగంగా సిఐటియు నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. వక్తలు మాట్లాడుతూ ఇజ్రాయిల్ అమెరికా అండతో పాలస్తీనాపై యుద్ధం చేస్తూ వేలాది మంది పిల్లలు, మహిళలు, ప్రజల ప్రాణాలు బలిగొంటుందని విమర్శించారు. యుద్ధాల వల్ల ఆఒక్క దేశ ప్రజలే కాకుండా ప్రపంచంలోని కార్మికులు, పేదలు, ప్రజలు అందరూ ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అమెరికా తన సామ్రాజ్యవాద అహంతో ఇజ్రాయిల్‌కు ఆయుధాలను అమ్ముతూ పాలస్తీనాపై యుద్ధాన్ని

2లో



వరద ప్రభావిత ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పరిశీలన

ప్రజాశక్తి-అమరావతి : స్థానిక కృష్ణానది పరివాహక గ్రామాలను పల్నాడు జిల్లా జెసి సూరజ్ ధనుంజయ్ సోమవారం డ్రోన్ ద్వారా పరిశీలించారు. ఇళ్ల నీట మునిగిన ప్రాంతాల్లో బోటు ద్వారా ప్రయాణించి పరిశీలించారు. తాజా పరిస్థితుల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు వీలుగా మ్యాప్‌ను రూపొందించాలని ఆదేశించారు.

టుటౌన్ సిఐపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-తెనాలి : పట్టణ టూటౌన్ సిఐ ఎ.సుధాకర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల ఓ మహిళ కు సంబంధించిన ఫొటోలు మార్ఫింగ్ చేసి, వాటిని ఆమెకే పంపి బ్లాక్ మెయిలింగ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదులో ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నది సమాచారం. పట్టణానికి చెందిన ఓ యువతి వైద్య రంగానికి సంబంధించి స్పీచ్ అండ్ హియరింగ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఫొటోలను దుండగులు మార్ఫింగ్ చేసి, ఆమెకే కొరియర్ ద్వారా పంపి, బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆమె పట్టణ టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టిన సిఐ ప్రకాశం జిల్లా కంభం, మార్కాపురం, గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన ముగ్గురు యువకుల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. అయితే వారిలో ఒకరిపై మాత్రమే కేసు నమోదు చేసి, మిగిలిన ఇద్దర్నీ పోలీసులే తప్పించారనే ఆరోపణలు రావటంతో ఐజి విచారణ చేపట్టారు. పోలీసుల నిర్లక్ష్యం నిర్ధారణ కావటంతో సిఐని సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి నిరసన

(మొదటి పేజీ తరువాయి)

పెంచుతోందని విమర్శించారు. ఈ విషయంలో భారతదేశ విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా ప్రధాని నరేంద్రమోడీ వ్యవహరిస్తున్నారని, అమెరికా అండతో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకించకపోవటం అన్యాయమని అన్నారు. శరణార్థి శిబిరాలు, ఆసుపత్రులు లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రజాస్వామికవాదులు అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకటేశ్వర్లు, మధ్య తరగతి ఉద్యోగుల కన్వీనింగ్ కమిటి కన్వీనర్ వివికె సురేష్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు సంఘం రాష్ట్ర నాయకులు కె.అనురాధ, ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు రవిశంకర్, పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ అధ్యాపకుల యూనియన్ నాయకులు ఆర్.స్వాతి మాట్లాడారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎం.సాంబశివరావు, కార్యదర్శి బి.లక్ష్మణరావు, జిల్లా కమిటి సభ్యులు కె.నాగేశ్వరరావు, గుంటూరు నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, పశ్చిమ అధ్యక్షులు బి.సత్యనారాయణ, ఎల్ఐసి నాయకులు సిహెచ్.రాజేశ్వరరావు, సిఐటియు నగర నాయకులు షేక్.మస్తాన్‌వలి, ఆది నికల్సన్ పాల్గొన్నారు.

శిశువు మృతి.. నిర్లక్ష్యమని ఆరోపణలు..

ప్రజాశక్తి-సత్తెనపల్లి : పూర్తిస్థాయిలో నొప్పులు రాకుండా, వైద్యులు లేకుండా నర్సులే కాన్పు చేయడం వల్ల శిశువు చనిపోయినట్లు బాలింత కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. దీనిపై బాధితుల వివరాల ప్రకారం.. పట్టణంలోని 5వ వార్డు పుట్టావారివీధికి చెందిన షేక్ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ భార్య సుల్తాన్ బేగం గర్భవతి కావడంతో ప్రతినెలా స్థానిక సంజన (గిరిజా) మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో పరీక్షలు చేయించు కుంటూ వస్తున్నారు. నెలలు నిండటంతో ప్రసవం కోసం గతనెల 30న అదే ఆస్పత్రిలో చేరారు. వైద్యులు పరీక్షించి సాధారణ కాన్పు అవుతుందని చెప్పారు. అదేరోజు మధ్యాహ్నం పూర్తిస్థాయిలో నొప్పులు రాకుండానే నర్సు, స్వీపర్ కలిసి గర్భిణిని ప్రసవం కోసం కాన్పుల గదికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యులకు సమాచారం ఇవ్వగా వారొచ్చి ప్రసవం చేశారు. అప్పటికే శిశువు తలభాగం నొక్కుకొని శ్వాస తీసుకునే పరిస్థితి లేకపోవటంతో ఆసుపత్రి వైద్యులే గుంటూరులోని మరొక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి శిశువు మృతి చెందడంతో సత్తెనపల్లికి తీసుకొచ్చారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందినట్లు బాలింత కుటుంబీకులు రోపిస్తున్నారు.

కృష్ణానదీ తీర ప్రాంత వాసులకు తప్పని కడ'గండ్లు'

- వెంటాడుతోన్న వరదభయం
- కునుకు పట్టని కృష్ణా తీరం

ప్రజాశక్తి - తుళ్లూరు

కృష్ణానదీ తీర ప్రాంత వాసులకు కునుకు కరువైంది.వరద భయంతో వణికిపోతున్నారు. నది వరదల నుంచి రక్షణ కోసం నిర్మించిన కరకట్ట నానాటికీ బలహీనమవుతూ గండ్లు పడుతున్నాయి. మండలంలోని వెంకటపాలెం దగ్గర మంతెన సత్యనారాయణ ఆశ్రయం వద్ద ఆదివారం రాత్రి కరకట్టకు స్వల్ప స్థాయిలో గండి పడగా స్థానికులు గమనించి ఇసుక మూటలు, రాళ్లు అడ్డుగా పెట్టారు. గండిని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, ఇతర అధికారులు పరిశీలించారు. సోమవారం ఉదయం మరోసారి గండి పడడంతో స్థానికులు మరోమారు దానిని పూడ్చి వేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు, సిఆర్‌డిఎ కమిషనర్ కె.భాస్కర్, ఎమ్మెల్యే కరకట్టను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. వెంకటపాలెంతోపాటు కరకట్ట వెంబడి బోరుపాలెం దగ్గర రెండుచోట్ల, హరిశ్చంద్రపురం దగ్గర కరకట్టకు గండ్లు పడడంతో ఇసుక బస్తాలను రక్షణగా ఏర్పాటు చేశారు. నీటి ఉధృతికి కరకట్ట తెగుతుందేమో, ఊళ్ళు మునిగిపోతాయేమోననే భయం తీవ్ర ప్రాంతా గ్రామాలను వెంటాడుతోంది.

తుళ్లూరు మండలంలోని హరిశ్చంద్రపురం దగ్గర నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు కృష్ణానదిపై కరకట్టను నిర్మించారు. కరకట్టకు ఇవతల వైపు మండలంలోని బోరుపాలెం, అబ్బరాజుపాలెం, రాయపూడి, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, తాళ్లాయపాలెం, వెంకటపాలెం గ్రామాలు ఉండగా హరిశ్చంద్రపురం గ్రామం కొంత నది లోపలి వైపు, కొంత ఇవతల వైపు ఉంది. నదిలో మరో 5 లంకల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. కృష్ణానదికి 1998లో, 2009లో భారీగా వరదలు వచ్చాయి. అప్పుడు కూడా కరకట్టకు అనేక చోట్ల గండ్లు పడ్డాయి. గండ్లు తెగి గ్రామాలు మునిగిపోతాయేమోనని రాత్రి మొత్తం నిద్రపోకుండా కరకట్టపై జాగారం చేయాల్సి వచ్చిందని, ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఎదురైందని ఆయా గ్రామాల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

కరకట్ట అభివృద్ధి ఎప్పుడు.. ?

కరకట్టను బలోపేతం చేస్తామని దశాబ్దాలుగా పాలకులు చెబుతున్న మాటలు కార్యరూపం దాల్చడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గండ్లు పడ్డప్పుడు తాత్కాలికంగా పూడ్చి వేయించి సరిపెడుతున్నారని మండిపడుతున్నారు. కరకట్ట తెగితే నష్టం ఏ స్థాయిలో ఉంటుందో తెలిసీ నివారణ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అంటున్నారు. కరకట్ట బలోపేతానికి నిపుణుల కమిటీని నియమించి వారి సూచనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కొల్లిపర మండలంలో వరద ఉధృతి

వరద గండం

(మొదటి పేజీ తరువాయి)

బోరుపాలెం దగ్గర రెండు చోట్ల,హరిశ్చంద్ర పురం దగ్గర కరకట్టకు గండ్లు పడడంతో ఇసుక బస్తాలను రక్షణగా ఏర్పాటు చేశారు. కొల్లూరు మండలం అరవింద వారధి వద్ద గతంలో వేసిన ఇసుకబస్తాలు కొట్టుకుపోవడంతో తొమ్మిది గ్రామాలకు ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు తెగిపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొల్లూరు మండలం నక్కపాయ వద్ద గండి గండి పడింది. నక్క పాయ వద్ద గండి పడిందని తెలియడంతో ఎన్‌డిఆర్‌ఎఫ్, గజ ఈతగాళ్ళను అధికారులు సిద్ధం చేశారు. బౌద్ధారామం అమరావతి మొత్తం నీట మునిగింది. అమరలింగేశ్వరస్వామి దేవాలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆలయంలోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా చుట్టూ వరద నీరు చేరింది. దాచేపల్లి, అచ్చంపేట, తాడేపల్లి, అమరావతి, కొల్లిపర మండలాల్లో పంట నష్టం, ఆస్తినష్టం ఎక్కువగా జరిగింది.

రెండు లక్షల ఎకరాల్లో పైర్లు మునక

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీ వర్షం, వరదలకు రెండు లక్షల ఎకరాల్లో పైర్లు నీట మునిగాయి. వరి, పత్తి, మిర్చి, పసుపు, కంది, కూరగాయాలు తదితర పైర్లు నీటిలో తేలియాడుతున్నాయి. త్వరగా నీరు బయటకు పోతే పైర్లు నిలదొక్కుకుంటాయని ఎక్కువ రోజులు నీరు నిలబడితే మాత్రం భారీ నష్టం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వెదపద్ధతిలో సాగు చేసిన వరి పనికిరాకుండా పోయిందంటున్నారు.

పునరావస కేంద్రాలకు తరలింపు

తాడేపల్లి మండలం మహానాడు ప్రాంతానికి చెందిన దాదాపు 2 వేల మందిని అధికారుల తాడేపల్లిలోని పునరావస కేంద్రానికి తరలించారు. దుగ్గిరాల, పెదకొండూరులో లోలెవల్ ఏరియాలోని ప్రజలను, తుళ్లూరు మండలంలోని ఉద్దండరాయునిపాలెం లంకలోని ప్రజలను పునరావస శిబిరాలకు తరలించారు. రాయపూడిలోని పెదలంకకు చెందిన 40 మందిని హెలికాప్టర్ ద్వారా విజయవాడకు తరలించారు. కొల్లిపర మండలంలోని అన్నవరపు లంక, కొత్తూరు లంక, బొమ్మువానిపాలెం నుండి 80 మందిని పునరావాస కేంద్రానికి పంపారు. ఈ మండలంలో వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ప్రజలను తరలించడానికి ఏర్పాట్లు చేశారు.



నాగార్జున సాగర్ 26 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎగువ నుండి నాగార్జున సాగర్ రిజర్వాయర్‌కు 5 లక్షల క్యూసెక్కుల భారీ వరద ఉధృతి కొనసాగుతుండడంతో ప్రాజెక్టు 26 గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 20 గేట్లను 15 అడుగులు, 6 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 5,03,268 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 586.80 అడుగులవద్ద నీరు నిల్వ వుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 304.4680 టీఎంసీల నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,582 క్యూసెక్కులు, కుడికాల్వ ద్వారా 6253 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులు, లోలెవల్ కెనాల్ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తంగా 5,40,503 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

కౌల్దార్లకే నష్టపరిహారం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి : అధిక వర్షాల బారినపడ్డ వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ కోరారు. అమరావతిలో కృష్ణానది వరద ప్రభావిత ప్రాంతాలను సిపిఎం బృందం సోమవారం పరిశీలించి, స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వాగులు, వంకలు పోటెత్తటం వల్ల లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ముంపుబారిన పడ్డారని, పైర్లు మునిగి రైతులు నష్టపోయారని చెప్పారు. అమరావతి వందలాది ఇళ్లు బారిన పడ్డంతో అనేక మంది నిర్వాసితులయ్యారని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సత్వరమే పారిశుధ్య పనులు చేపట్టకుంటే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందన్నారు. పత్తి సాగు కోసం ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి ఖర్చయిందని, దీనికి కౌలు అదనమని, ఇప్పుడు ఆ పైరంతా నీటిలో నానుతోందని తెలిపారు. సత్వరమే నష్టాన్ని అంచనా వేసి బాధితులందరికీ పంట నష్టపరిహారం ఇవ్వాలని, కౌలురైతులకే ఈ పరిహారం దక్కాలని కోరారు. మరోసారి సాగుకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో పైర్లు దెబ్బతినడం వల్ల వ్యవసాయ కార్మికులకు సుమారు నెలరోజుల వరకు పనులు దొరికే పరిస్థితి లేదని, ఆ కుటుంబాల జీవనం కోసం నిత్యాసరాలు, బియ్యం ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని కోరారు. పరిశీలనలో సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు, నాయకులు బి.పౌలు రైతులు సిహెచ్.నాగేశ్వరావు, గంగాధరావు పాల్గొన్నారు.



ఘనంగా ఎస్ఆర్ఎం స్నాతకోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : ఇంజినీరింగ్ విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని దేశాభివృద్ధికి తోడ్పాటును అందించాలని పద్మభూషణ్ సేనాపతి క్రిస్ గోపాలక్రిష్ణన్ పిలుపునిచ్చారు. రాబోయే 30 ఏళ్లలో భారత్ ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలుస్తుందనీ, నేటి తరం విద్యార్థుల భాగస్వామ్యం కోసం ప్రపంచం ఎదురు చూస్తోందని అన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 4వ స్నాతకనోత్సవం వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్కుమార్ అరోరా అధ్యక్షతన ఘనంగా జరిగింది. గౌరవ అతిథిగా హాజరైన స్విగ్గీ కంపెనీ సీఈవో రోహిత్ కుమార్ మాట్లాడుతూ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమకున్న ప్రతిభకు పదును పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా 1018 మంది విద్యార్థుల డిగ్రీలను ముఖ్య అతిథి సేనాపతి క్రిస్ గోపాలక్రిష్ణన్, సిగ్గీ సీఈవో రోహిత్ కుమార్, వర్సిటీ ఛాన్సలర్ సత్యనారాయణ ప్రదానం చేశారు. పతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ఐదుగురికి వెండి, మరో ఐదుగురికి కాంస్య పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వ్యవస్థాపక చాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్.రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నివాళులర్పించారు. సత్తెనపల్లి పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విగ్రహానికి మాజీ మంత్రి అంబటి రాంబాబు పూలమాలలేశారు. నరసరావుపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాళి అర్పించారు. వినుకొండలోని వైసిపి కార్యాలయంలో విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, నాయకులు పూలమాలలేశారు. మార్కాపురం రోడ్డులోని చెక్‌పోస్టు వద్ద గల విగ్రహానికి పూలమాలలేశారు. పిడుగురాళ్ల పట్టణంలోని అంజిరెడ్డి హాస్పిటల్ వద్ద గల వైయస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పూలమాలలేశారు. అనంతరం అన్నదానం చేశారు. కారంపూడిలోని వైఎస్ఆర్ విగ్రహానికి భారీ గజమాల వేసి కొబ్బరికాయలు కొట్టారు. యడ్లపాడులో అన్నదానం చేశారు. లింగారావుపాలెం విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



బాధితుల అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆయా సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులకు మేలు జరిగేలా సకాలంలో విచారణ జరిపి పరిష్కరించాలని పోలీసు సిబ్బందిని పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ లక్ష్మీపతి ఆదేశించారు. నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు ఎస్పి

బీమా సొమ్మును కాజేస్తున్నారు..

తన భర్త మృతి చెందగా అతనికి సంబంధించి రూ.3.40 లక్షల బీమా సొమ్ము నామినీగా ఉన్న తనకు వచ్చాయని, అయితే సోదరుడు ఖాదర్, వదిన ఖాజాబి మరికొంత మంది కుటుంబ సభ్యులు కలిసి వితంతు మహిళ అనే జాలి, దయ లేకుండా బీమా సొమ్ము కాజేయాలని చూస్తున్నారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని నరసరావుపేట పట్టణం పెద్దిరెడ్డి నగర్‌కు చెందిన వితంతు మహిళ షేక్ సైదాబి ఫిర్యాదు చేశారు.

ఇంటి నుండి గెంటేశారని మహిళ ఫిర్యాదు..

తల్లిదండ్రులు మనస్పర్థల కారణంగా విడిపోగా తండ్రి తన పేరిట చిలకలూరిపేటలో ఉన్న ఇంటిని రాశాడని, అయితే ఇంటిపై తమకు హక్కులు ఉన్నాయంటూ తన నాయనమ్మ, పెదనాన్న, కొందరు వేధింపులకు పాల్పడుతున్నారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని చిలకలూరిపేట పట్టణం మద్ది నగర్‌కు చెందిన షేక్ హీనా ఫిర్యాదు చేశారు.

భర్తపై భార్య ఫిర్యాదు..

తన భర్త, అత్తమామలు వరకట్నం కోసం వేధిస్తున్నారని న్యాయంచేయాలని నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన ఆలూరి అంజలి భర్త వంశీకృష్ణ అతని కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారు. తన భర్త వివాహేతర సంబంధం పెట్టుకుని వేధిస్తున్నాడు. దీనిపై నకరికల్లు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని త్వరితగతిన విచారణ జరిపి న్యాయం చేయాలని వేడుకున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - వినుకొండ



అరుగు మీద కూర్చుని ఉన్న మహిళ మెడలో బంగారం గొలుసు లాకెళ్లిన సంఘటన వినుకొండ పట్టణం కొత్తపేటలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. స్థానిక కొత్తపేట 1వ లైన్ గ్యాస్ సలీం బజార్‌కు చెందిన పులిమెట్ల విజయలక్ష్మి తన మనవడు పక్క ఇంట్లో ఆడుకుంటుండగా అరుగు మీద కూర్చుని మరో ఇద్దరి మహిళలతో మాటాల్లో పడింది. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి స్కూటర్ వచ్చి కొంతదూరంలో ఆగింది. మరో వ్యక్తి అరుగుపై కూర్చొని ఉన్న విజయలక్ష్మి మెడలో ఉన్న బంగారుచైన్‌ను లాక్కొని బైక్‌పై ఉడాయించారు. ఆరు సవర్లబంగారు ఉంటుందని బాధితురాలు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 35,607
మిర్చి ఎగుమతి	: 32,517
మిర్చి నిల్వ	: 18,709

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7,500 - 15,500
నెం.5	8,500 - 14,000
273	12,500 - 12,500
341	8,000 - 16,000
	నాన్ ఎసి
తేజ	7,500 - 18,500
బడిగి	8,500 - 14,000
దేవనూరు డీలక్స్	9,500- 14,500
తాలుకాయలు	4,500 - 11,000
	ఎసి
334	11,000 -15,500
నెం.5	9,500 - 9,500
341	10,500 - 16,000
4884	11,000 - 13,000
సూపర్ 10	9,500 -10,000
తేజ	9,000 - 18,300
బడిగి	9,000 - 14,000
తాలుకాయలు	5,000 - 10,000

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



ద్విచక్రవాహనం అదుపు వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. సత్తెనపల్లి పట్టణానికి చెందిన జాలాది శ్రీనివాసరావు ధూళిపాళ్ల లయోలా ఇంజనీరింగ్ కళాశాల క్యాంటిన్‌లో పని చేస్తున్నాడు. ధూళిపాళ్ల నుండి సత్తెనపల్లి వస్తుండగా మార్గమధ్యంలో వెన్నాదేవి 400 కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య పనులకు సహకరించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు పురపాలక సంఘం అధికారులు పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని 11,12వార్డులలో పారిశుధ్య పనులను ఎమ్మెల్యే పరిశీలించి దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఎడతెరిపి లేని వర్షాలతో ఉదతంగా వరదలు ఉన్నప్పటికీ పారిశుధ్య పనులలో ఎక్కడ జాప్యం ఏర్పడరాదని నిర్లక్ష్యానికి తావు లేకుండా పురపాలక సంఘం అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కషి చేస్తానని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో నరసరావుపేట పట్టణంలో ఆయన విస్తతంగా పర్యటించారు. ఆయా ప్రాంతాలలో స్థానిక ప్రజలతో కలిసి తేనీరు సేవిస్తూ మాట్లాడారు.

వరద బాధితులకు ఆహారం, నీరు సాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వరద ముంపులో చిక్కుకున్న విజయవాడ ప్రజలకు తోచిన సాయం అందించడం తమ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మె ల్యే ప్రత్తిపాటి పుల్లారావు నియోజకవర్గ ప్రజలకు పిలునిచ్చారు. వరద బాధితుల బావుండాలని ప్రార్థించడంతో పాటు ఆకలి తీర్చేందుకు ఏదో ఒక రూపంలో సహాయపడితే అంతకుమించిన మేలు మరొకటి ఉండదన్నారు. 50ఏళ్లలో ఎన్నడూ లేని వర్షాలకు వరద గుప్పిట చిక్కుకున్న విజయవాడలో ముంపు బాధితులకు పంపిణీ చేయడానికి చిలకలూరిపేట, అద్దంకి నియోజకవర్గాల నుంచి సోమవారం ఆహారం, నీరు తరలించారు. 3 వేలమందికి సరిపడా వెజిటేబుల్ బిర్యానీ, పెరుగన్నం, మంచినీటి బాటిళ్లు అందిస్తున్నారన్నారు. ఆహారం సరఫరా విషయమై విజయవాడ ఎంపీ కేశినాని చిన్నితో మాట్లాడటం జరిగిందని, ఏ ప్రాంతాల్లో పంపిణీ చేయాలో చెప్పాలని అడిగామని, ఆయన ఒక నెంబర్ ఇచ్చి వారిని సంప్రదించాలని సూచించారన్నారు. మంచి మనసుతో ముందుకొచ్చిన కేఎస్ఆర్ మిత్రమండలి సభ్యులను పేరుపేరునా అభినందిస్తున్నానని తెలిపారు. చిలకలూరిపేట తహసీల్దార్ హుస్సేనే నేతత్వంలో మరో వెయ్యిమందికి భోజనాలు పంపించడం జరిగిందన్నారు. చిలకలూరిపేట, అద్దంకి నియోజకవర్గాల నుంచి మొత్తం 4 వేలమందికి భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నారన్నారు.

విద్యా సంస్థలకు నేడూ సెలవు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు మంగళవారమూ సెలవు ప్రకటిస్తున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదివారం కలెక్టరేట్ నుండి ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. విద్యాసంస్థలు విధిగా సెలువు ఇవ్వాలని స్పష్టం చేశారు.



హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

సత్తెనపల్లి మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పల్నాడు జిల్లా కన్వీనర్ కె.సాయి డిమాండ్ చేశారు సోమవారం స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఎస్ఎఫ్ఐ సత్తెనపల్లి మండల విస్తృత సమావేశంలో 10 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా షాదుల్లా, డి.అమూల్య ఎన్నికయ్యారు. కె.సాయి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో సంక్షేమ హాస్టల్లో పక్క భావనాల నిర్మాణం చేపట్టాలని, నియోజకవర్గ కేంద్రాల్లో ఐ.టి.ఐ కళాశాల, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. సమావేశంలో ఇశాంత్, సత్తిబాబు, ఫణీంద్ర, భరత్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.



దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

55.75 లీటర్ల బయో ఉత్పత్తులు సీజ్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను గుంటూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ ఎమ్.రామచంద్రయ్య వ్యవసాయ అధికారి కె.రమణకుమార్ సోమవారం తనిఖీ చేశారు. శివశంకర ఫెర్టిలైజర్స్ దుకాణంలో శ్రీకర్ బయోటెక్ కంపెనీకి సంబందించిన కొన్ని బయో ప్రొడక్ట్సనకు జీ.-3 సర్టిఫికేట్ సమర్పించని కారణంగా రూ.1.73,285 విలువైన 55.75 లీటర్ల స్టాకును సీజ్ చేశారు.

ఘాట్‌రోడ్‌లో అటవీశాఖాధికారి పరిశీలన

ప్రజాశక్తి - యడ్లపాడు

కొండవీడు ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు, ఆర్ అండ్ బి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. వీటిని అటవిశాఖ సిబ్బంది సహకారంతో మంగళవారంలోగా తొలగించాలని ఆర్ అండ్ బి అధికారులను కోరారు. అనంతరం కొండవీడు నగరవనం ప్రాంతాన్ని సందర్శించిన అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండవీడు నగరవనంలోని మూడు చెరువులు (పుట్టాలమ్మ చెరువు, ముత్యాలమ్మ చెరువు, వెదుళ్ల చెరువు) నీటితో నిండిపోయాయి.

ప్రతి సచివాలయంలోనూ కంట్రోల్ రూమ్ : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌కుమార్ ఆదేశించారు. ప్రజల జీవన పరిస్థితి, అందిస్తున్న సహాయక చర్యలపై జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి సోమవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రోగాలు ప్రబలకుండా చూడాలని, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గ్రామాల్లో విస్తృతంగా క్లోరినేషన్, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆస్తి నష్టం, పశు-పంట నష్టం అంచనా వివరాలను త్వరితగతిన నమోదు చేసి అందించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని ఆదేశించారు. పరిస్థితులు మెరుగయ్యే వరకూ పునరావాస కేంద్రాలను కొనసాగించాలన్నారు. వర్షానికి దెబ్బతిన్న పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల్లో విద్యార్థులు ప్రవేశించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అన్నిచోట్లా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలన్నారు. జిల్లా అధికారులంతా క్షేత్ర స్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

1165 ఎకరాల ఉద్యాన పంటలకు నష్టం

ఎడతెరిపి లేని వానల నేపథ్యంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా 525 మంది రైతులకు చెందిన 1165 ఎకరాల ఉద్యాన పంటలు కొన్ని పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సిహెచ్. వి రమణారెడ్డి తెలిపారు. సమగ్ర యాజమాన్య చర్యలు ద్వారా కొంతమేర దిగుబడి సాధించి నష్టాన్ని అధిగమించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. మిర్చి, పసుపు, అరటి, జామ, బొప్పాయి, పూల తోటలు, కూరగాయల తోటలను సాగు చేశారన్నారు. అత్యధికంగా అమరావతి మండలంలో 150 ఎకరాలు, అచ్చంపేట మండలంలో 75 మందికి చెందిన 562 ఎకరాల మిర్చి పైరు దెబ్బతిందని చెప్పారు.



వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని గుడిపూడి, పెదమక్కెన గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎస్.రాజమణి, పి.కిషోర్‌వర్మ, సిహెచ్ నాగజ్యోతి సోమవారం పరిశీలించారు. పొలాల్లోని నీటిని బయటకు పంపించి 13- 0- 45 :10 గ్రాములు లేదా 19- 19-19: 10 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములు మరియు 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. 90 రోజుల వయసున్న పొలంలో బూస్టర్ డోస్‌గా 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఒక ఎకరాకు వేసుకోవాలని చెప్పారు. బోరాక్స్ 1.5 గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలని, ఆకుమచ్చ, బ్యాక్టీరియా తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది కనుక కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ ఒక గ్రాము 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలని వివరించారు. పరిశీలనలో సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.సామంతరెడ్డి, కె.రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

పలుప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలోని పలు కాలనీలను, నరుకుళ్లపాడు, యండ్రాయి గ్రామాల్లో ప్రాంతాలను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించేలా చూడాలని, వరదల్లో



చిక్కుకున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులు, నాయకులను ఆదేశించారు. వరద నేపథ్యంలో ప్రజలు బయటకు రాకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. పరిశీలనలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ ఉన్నారు.

మాచర్లలో రికార్డు స్థాయిలో వాన

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్లలో రికార్డు వర్షపాతం నమోదైంది. 17 ఏళ్ల తరువాత 16.46 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. 2007 తర్వాత ఇంత పెద్దఎత్తున వర్షం లేదని నాటి విషయాలను స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. నియోజకవర్గం వారీగా శనివారం మాచర్లలో 16.46 సెంటీమీటర్లు, వెల్దుర్తిలో 13.54 సెంటీ మీటర్లు,



దుర్గిలో 12.06 సెంటీ మీటర్లు, రెంటచింతలలో 13.94 సెంటీ మీటర్లు, కారంపూడిలో 9.38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనది. ఒక రోజులో ఇంత పెద్ద ఎత్తున వర్షపాతం కురవటంతో చెరువులు, వాగులు, వంకలు నిండి పొంగి, పోర్లుపారుతున్నాయి. ఇదిలా ఉండగా ఉధృతంగా ప్రవహిస్తున్న చంద్రవంక వాగును మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు పరిశీలించారు. ఈ వర్షంతో ఏడాది పాటు నీటి కొరత లేకుండా పోతుందన్నారు. దాదాపు సాగు, తాగు నీటి కష్టాలు ప్రస్తుత ఏడాది లేనట్టేనన్నారు.

బీమా మార్కెట్‌లో తిరుగులేని శక్తిగా ఎల్ఐసి

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయకరణ నాటి నుండి ప్రగతి పథంలో నడుస్తూ 68 ఏళ్లగా ప్రభుత్వరంగ ఎల్ఐసి దేశ సేవకు అంకితమై ప్రపంచ స్థాయి సంస్థగా ఎదిగిందని జెకెసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు అన్నారు.ఎల్ఐసి ఆఫ్ ఇండియా 68వ వ్యవస్థాపక ఉత్సవాల సందర్భంగా అరండల్‌పేట 4వ లైన్ ఎల్ఐసి కార్యాలయంలో వారోత్సవాలను ఆయన సోమవారం పారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీమా మార్కెట్లో 25 ప్రైవేటు కంపెనీల నుండి ఎదురైన పోటీని తట్టుకుని సుమారు 70 శాతం నూతన పాలసీలను ఎల్ఐసి కైవసం చేసుకోవడం కోట్లాది మంది పాలసీదారుల నమ్మకం, వారి విశ్వాసం వల్లనే సాధ్యపడిందని అన్నారు. దేశ ఆర్థిక అవసరాల రీత్యా ఎల్ఐసి మరింతగా శక్తివంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆయన పాలసీదారుల ప్రత్యేక సేవాకేంద్రాన్ని ప్రారంభించారు. ఎల్ఐసిని మరింత బలోపేతం చేస్తామని అధికారులు, ఉద్యోగులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.అడ్మినిస్ట్రేటివ్ అధికారి మహమ్మద్ రఫీ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎల్ఐసి సాధించిన అభివృద్ధిని వివరించారు. బ్రాంచి మేనేజర్ (సేల్స్) ఆర్.వి.సుబ్బారావు, పి.వి.రమణ, వివికె



సురేష్, ఆర్.వి.ఎస్.శ్రీనివాస్, ఎన్.విజయకుమార్, ఎన్.విజయలక్ష్మి, ఆర్.విజయరాఘవ, పి.శ్రీదేవి, కె.లలిత, ఎ.శంకర్, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఎంవిఎస్‌కె స్కూల్లో ప్రీ ప్రైమరీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు



భవనం ప్రారంభోత్సవంలో డాక్టర్ రత్నబాబు, వారి కుటుంబ సభ్యులు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

స్థానిక 41వ డివిజన్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లోని ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం నిర్మించిన 'యశ్వంత్ వెంకట ప్రణవ్ కామేపల్లి భవన్'ను సోమవారం ప్రారంభించారు. కామేపల్లి యశ్వంత్ వెంకట ప్రణవ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ప్రారంభోత్సవంలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కామేపల్లి రత్నబాబు, కె.సుబ్బాయమ్మ, డాక్టర్ కామేపల్లి రవికుమార్, కె.నళినీ, ఎమ్మెల్సీ, స్కూల్ కమిటీ అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎన్.తాండవకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ రత్నబాబు మాట్లాడుతూ ఈ పాఠశాలలో పేద విద్యార్థులకు, అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, ఇటువంటి పాఠశాలకు తమ మనువడు ప్రణవ్ జ్ఞాపకార్థం భవనం నిర్మించటం సంతోషంగా ఉందని అన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు కోరిక మేరకు ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ పాఠశాల ఎంతో మంది దాతల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతోందని చెప్పారు. అందరి నమ్మకాన్ని నిలబెడుతూ రాబోయే కాలంలో పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తామన్నారు. డాక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ స్వయం కృషిని నమ్ముకొని లక్ష్యసాధన దిశగా సాగాలని, ఎప్పుడూ సంతోషంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు జూట్ లంచ్ బ్యాగ్‌లను అందచేశారు. కార్యక్రమంలో స్కూల్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.ఉపేంద్ర ఎయుఎఎస్‌డి ప్రెసిడెంట్ ఎం.వెంకటేశ్వరరెడ్డి, కన్వీనర్ సాంబశివరావు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.దుర్గాప్రసాద్, అడ్మిన్ ఆఫీసర్ ఎల్.ఎస్.భారవి, వైస్‌ప్రిన్సిపాల్ కెడిఎన్.దివ్య, ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు భార్య అమ్మణి, డాక్టర్ రత్నబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు లోతట్టు ప్రజలు


తాడేపల్లిలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

భారీ వర్షాల వలన ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టడం జరిగిందని, బాధితులకు ప్రభుత్వం అండగా వుంటుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. గుంటూరు జిల్లాలో ఆగస్టు 31వ ఉదయం 4 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు కురిసిన వర్షానికి కష్ణా నదికి 10.5 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చిందని, జిల్లాలో నదికి ఆనుకొని ఉన్న గ్రామాలలోకి, కాలనీలలోకి నీరు రావడం వలన అక్కడ వున్న వారిని రిలీఫ్ క్యాంపులకు తరలించామన్నారు. తాడికొండ నియోజకవర్గంలోని మహానాడు ఏరియాలో 2వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. తాడేపల్లిలో మొత్తం 4 క్యాంపులు ఏర్పాటు చేశామని, ఇవే కాకుండా దుగ్గిరాల, పెదకొండూరులో లోలెవల్ ఏరియాలోని ప్రజలను, తుళ్ళూరు మండలంలోని ఉద్దండరాయుని పాలెం లంకలోని ప్రజలను క్యాంపులకు తరలించామన్నారు. అలాగే పెద్దలంకలోని ప్రజలను ఇబ్రహీంపట్నం, విజయవాడ వైపునకు తరలించామన్నారు. ఇంకా పెదలంకలో మిగిలిన 40 మందిని ఈరోజు హెలికాప్టర్ ద్వారా రెస్క్యూ చేయడం జరిగిందన్నారు. అలాగే తెనాలి నియోజకవర్గం, కొల్లిపర మండలంలోని అన్నవరపు లంక, కొత్తూరు లంక, బొమ్మువానిపాలెం నుండి 80 మందిని పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. అన్నవరపు లంకకు ఇంకా నీళ్ళు రాలేదని, అక్కడ సహాయ సిబ్బంది వున్నారని, అన్నవరపు లంకకు రెండు, కొత్తూరు లంకకు రెండు ప్రైవేట్ బోట్లను ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు ఫైర్, ఎన్‌డిఆర్ఎఫ్ బోట్స్ కూడా వున్నాయన్నారు. ఇక్కడ లోతట్టు ప్రాంత ప్రజలను తరలిస్తున్నారని, సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టడం జరుగుతున్నా యన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ సిపిఓ ఆధ్వర్యంలో నడుస్తుందని, ఇంకా కొన్ని శాఖల సిబ్బంది ఉన్నారని, జిల్లాలో ఎక్కడ నుండి అయిన కాల్స్ వస్తే వెంటనే సంబంధిత సిబ్బందికి తెలియజేయడం జరుగుతుందన్నారు. అలాగే తెనాలి డివిజన్ లోని పంచాయతీ చెరువులు, ఇరిగేషన్ కాలువలు కోతకు గురి కాకుండా, సిబ్బంది చూస్తున్నారని, అవసరమైన ఇసుక బస్తాలు, డస్ట్ లు నిల్వ చేసుకొని లీకులు ఏమైన ఉంటే ఆపుతున్నారన్నారు. రాయపూడి వద్ద చిన్న కోత వచ్చిన వెంటనే పూడ్చి వేయడం జరిగిందన్నారు. అలాగే తెనాలి, కొల్లిపర, వల్లభాపురం వద్ద వచ్చిన లీకులను డస్టుతో పూర్తి చేయడం జరిగిందన్నారు. రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేసిన అన్ని చోట్ల, లోకల్, రెవెన్యూ, పోలీస్, పంచాయితీ, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకొంటున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రైన్లపై ఆక్రమణలను స్పెషల్ యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసి తొలగిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం జిటి రోడ్, శ్రీనివాసరావుతోట ప్రాంతాల్లో డ్రైన్లపై ఆక్రమణలను ఏసిపి అజయ్ కుమార్, టిపిఎస్ సువర్ణకుమార్ అక్రమ ఆక్రమణ దళంతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డ్రైన్లపై ఆక్రమణల వలన వ్యర్ధాలు అడ్డుపడి వర్షం నీరు రోడ్ల మీదకు, ఇళ్లల్లోకి వస్తుందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రజల ఇబ్బందుల దష్ట్యా డ్రైన్ల ఆక్రమణలను గుర్తించి, తొలగింపునకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. అలాగే డ్రైన్ల ఆక్రమణలను ముందస్తుగానే గుర్తించి తొలగించాలన్నారు. ప్రస్తుత వర్షాలకు నీరు నిలిచిందో గుర్తించి, అక్కడ భవిష్యత్‌లో నీరు నిల్వకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. నగర ప్రజలు కూడా ప్రధాన డ్రైన్లను వివిధ వ్యాపారాల పేరుతో ఆక్రమణ చేయవద్దని, తప్పనిసరిగా డ్రైన్‌కి వెనుక వైపు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్రైన్ల మీద, డ్రైన్ కి ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకుంటే వెంటనే తొలగించడం జరుగుతుందన్నారు.

నీళ్లల్లోనే గ్రామాలు

ప్రజాశక్తి-దుగ్గిరాల: వరద ప్రవాహం పెరుగుతున్న కొద్దీ రైతులలో ఆందోళనలు పెరుగుతున్నాయి .ఇప్పటికే మండల పరిధిలోని లంక పొలాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. మండల పరిధిలో వరద ప్రవాహం కరకట్ట ఎత్తుకు కేవలం రెండు అడుగుల మాత్రమే ఉన్నది. ఒక ప్రక్క అధిక వర్షాలకు నీటిలో మునిగిన పంట పొలాలు మరో ప్రక్క వరద నీటికి ముంపుకు గురైన లంక పొలాలలో నీరు ఎప్పుడు తగ్గుతాయని రైతులు ఎదురుచూస్తున్నారు. ఎన్‌డిఆర్‌ఫ్ సిబ్బంది జల శాఖ సిబ్బంది కరకట్టలను పర్యవేక్షిస్తున్నారు.

.**ప్రజాశక్తి - తుళ్లూరు** :సోమవారం సాయంత్రానికి కృష్ణా నదికి వరద స్వల్పంగా తగ్గింది. అయినప్పటికి గ్రామాల్లో నీరు పెద్ద ఎత్తున నిలిచిపోయింది. మందడం టిడ్కో గృహ సముదాయాల వద్ద రహదారిపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. తుళ్లూరు జెడ్పి హైస్కూల్ ఆటస్థలం నీటితో నిండిపోయి నీరు పక్కనే విద్యార్థులు నడిచే సిమెంట్ రోడ్డు పైకి చేరాయి. బోరుపాలెం వద్ద హిందూ స్మశాన వాటిక కృష్ణానదిలో మునిగింది. హరిశ్చంద్ర పురం గ్రామంలో కొంత భాగం కృష్ణా నదిలో ఉంది. ఆదివారం వరద నీరు పెద్దఎత్తున కరకట్ట అంచుకు చేరింది.దీంతో కొంతమంది ఇళ్ల నుంచి సురక్షిత ప్రాంతాలకు రాగా కొంతమంది ఇళ్ళల్లోనే ఉన్నారు. కరకట్ట కు గండి పడకుండా గ్రామస్తులు,అధికారులు ఇసుక కట్ట ఏర్పాటు చేశారు. అధిక వర్షాలకు అరటి, పత్తి, మునగ, వరి చేలు నీట మునిగాయి. నీరు మండలంలో అనేక చోట్ల పెద్ద ఎత్తున నీరు చేరడంతో చెరువుల్ని తలపిస్తూ కనిపిస్తోంది.

ముంపు ప్రాంతాల్లో సిపిఎం, రైతు సంఘం పరిశీలన


చేబ్రోలులో


చిర్రావూరులో


కొల్లిపరలో


దుగ్గిరాలలో


తుళ్లూరులో

ప్రజాశక్తి-గుంటూరు : వరదలతో జిల్లాలో వెద పద్ధతిలో వేసిన వరి పైర్లు దాదాపు 26వేల ఎకరాలు దెబ్బ తిన్నాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ అన్నారు. సోమవారం చేబ్రోలు మండలంలో తుంగభద్ర కాలవ పరిధిలోని వరి పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దకాకాని, చేబ్రోలు మండలాల్లో, తుంగభద్ర కాల్వ పరిధిలోని పంటలు వరదల కారణంగా దెబ్బతిన్నాయని, అంతేకాకుండా గ్రామాల్లో నీరు చేరిందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేల రూపాయలు వెంటనే అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. దెబ్బతిన్న పైర్లకు ఎకరాకు రూ.30వేల రూపాయలు నష్టపరిహారం అందించాలన్నారు. పర్యటనలో రైతుసంఘం మండల నాయకులు కావూరి వాసుదేవరావు ముప్పవరపు రామయ్య, నాగమోతు ప్రేమచందు, రామినేని వంశీకష్ణ, నల్లపాటి నాగమల్లేశ్వరరావు, రామినేని అనీల్, బేతపూడి ఆదినారాయణ, బెల్లంకొండ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : గత నాలుగు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు ఎగువ నుండి కృష్ణానది ఉధృతంగా ప్రవహించడంతో, ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు లంక పొలాలు పూర్తిగా నీట మునిగాయి. సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు చిర్రావూరు గ్రామంలోని రైతులు, కౌలు రైతులను కలుసుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ లక్షల పెట్టుబడులు పెట్టిన పంటలైన పసుపు, అరటి, కంద, మినుము వంటి పంటలు నీటిపాలయ్యాయని అన్నారు. నష్ట పోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి, నష్ట పరిహారం అంచనా వేసి, రైతులకు పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డి వెంకటరెడ్డి, కాజా వెంకటేశ్వరరావు, పల్లె కృష్ణ, బొప్పన గోపాల రావు, మేడూరి పాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్, దుగ్గిరాల

మంగళగిరి, దుగ్గిరాల మండలంలోని నూతక్కి, రామచంద్రపాలెం, వీర్లపాలెం, పెద కొండూరు, గొడవర్రు గ్రామాలలో కృష్ణానది వరద ముంపు ప్రాంతాన్ని సిపిఎం ఆధ్వర్యంలో పర్యటించారు. రామచంద్రాపురంలో దాదాపు వెయ్యి ఎకరాలు పసుపు, అరటి, గులాబి, బంతి పొలాలు ముంపునకు గురయ్యాయని రైతులు సిపిఎం నాయకులకు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతు లంక భూములు మొత్తం నీటితో మునగాయని, పంట నష్టం తీవ్రంగా జరిగిందని వీరిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జెట్టి బాలరాజు యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు రైతులు కౌలు రైతులు వీ సూరయ్య శ్రీనివాస కుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర :కృష్ణానది వరద కారణంగా నష్టపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, రైతు సంఘం ఎం శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొల్లిపర మండలం కృష్ణ పరివాహ ప్రాంతాలైన వల్లభాపురం మున్నంగి బొమ్మువానిపాలెం గ్రామాల్లో పర్యటించి పంట నష్టం తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కోటా చంద్రశేఖర్ జిలుగు ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు :కష్ణానది వరదల కారణంగా నిరాశ్రయులయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి కోరారు. మండలంలోని వెంకట పాలెం పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వరద బాధితులతో రవి మాట్లాడారు.

విజయవాడ ముంపు ప్రజలకు జిఎంసి ఆహార పదార్థాలు

ప్రజాశక్తి-గుంటూరు

భారీ వర్షాల కారణంగా విజయవాడ నగరంలోని ముంపు ప్రభావిత ప్రజలకు గుంటూరు నగరపాలక సంస్థ తరుపున బిస్కెట్లు, పాలు, బ్రెడ్, పులిహోర అందిస్తున్నామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీ వర్షాల వలన విజయవాడ నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు ముంపునకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, సంచాలకులు హరినారాయణ మురగన్ ఆదేశాల మేరకు జిఎంసి తరపున ఆదివారం పాలు, బిస్కెట్లు, వాటర్ బాటిల్స్, బ్రెడ్ ప్యాకెట్లు అందించామని, సోమవారం కూడా షుమారు 55వేలు పులిహోర, 31,200 వేల వాటర్ బాటిల్స్, 52 వేలు బిస్కెట్ ప్యాకెట్స్, 2300 బ్రెడ్ ప్యాకెట్లు అందిస్తున్నామని తెలిపారు. ఆహారం, వాటర్ బాటిల్స్‌లను విజయవాడకు ప్రత్యేక వాహనాల ద్వారా పంపిస్తున్నామన్నారు.

ఓపీఎస్‌కు ఏదీ ప్రత్యామ్నాయం కాదు

ప్రజాశక్తి-గుంటూరు :ఉద్యోగులకు సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ వంటి విధానాలు కాకుండా అందరికీ ఆమోదయోగ్యమైన ఓపిఎస్‌ను అమలు చేయాలని గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాష అన్నారు. సోమవారం గుంటూరు వారితోటలోని ఎపిజిఇఎ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులను ప్రక్కదారి పట్టించేలా జిపిఎస్ అని, యుపిఎస్ అని దోబూచులాడుతున్నాయని అన్నారు. ఉద్యోగులకు ఇవేవీ ప్రత్యామ్నాయం కాదని, ఓపిఎస్ మాత్రమే అంగీకారం అన్నారు. ఉద్యోగులు ఐక్యంగా ఓపిఎస్ సాధించుకొని తీరతాం అన్నారు. ఇక నుండి సెప్టెంబర్ 1 వ తేదీని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు పెన్షన్ విద్రోహ దినంగా జరపాలని నిర్ణయించినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లాషాఖాదిరి, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు నివాస్‌రెడ్డి, రత్తయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్‌లో గోల్డ్ లోన్లు

ప్రజాశక్తి-గుంటూరు :శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాబోయే పండుగ సీజన్‌కు ముందు కస్టమర్లకు సులభంగా, సౌకర్యవంతంగా రుణలు అందజేసే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో 'జిత్నే సమయ్ కా లోన్ ఉత్నే కా హి బయాజ్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎలిజబెత్ వెంకటరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని శ్రీరామ్ ఫైనాన్స్ శాఖల్లో మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేసి గోల్డ్‌లోన్ శాఖలుగా మార్చడానికి సంస్థ పెట్టుబడి పెడుతుందన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని 304 శాఖల్లో 184 శాఖలు గోల్డ్‌లోన్‌లు అందిస్తున్నాయన్నారు. కస్టమర్‌లు తమ విభిన్న ఆర్థిక అవసరాల కోసం గోల్డ్ లోన్‌లను సాధారణ క్రెడిట్ రూపంలో ఉపయోగించడాన్ని మేము గమనించామని, అవసరాన్ని బట్టి బంగారాన్ని తాకట్టు పెట్టడం, రీడీమ్ చేయడం వంటివి జరుగుతున్నాయన్నారు. లోన్ కాల వ్యవధికి మాత్రమే వడ్డీని చెల్లించే సామర్థ్యం నుండి ప్రయోజనం పొందుతారని, ఈ గోల్డ్ లోన్‌లు సరసమైన వడ్డీ రేట్లతో గరిష్టంగా 12 నెలల కాలవ్యవధితో ఉంటాయన్నారు. కావున కష్టమర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పునరావాస కేంద్రాల్లో 45 మంది

రత్నాలచెరువులో పునరావాస కేంద్రం ఏది?

ప్రజాశక్తి - మంగళగిరి : భారీ వర్షాలతో ఉపాధి కోల్పోయిన బాధితుల కొరకు మంగళగిరి పట్టణంలో ప్రభుత్వం మూడు చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో 45 మంది మాత్రమే ఉన్నారు. ఇందిరానగర్, కొండ ప్రాంతంలో కొండ రాళ్ళు విరిగిపడి కొత్తపేట ప్రాంతంలో ఒక వృద్ధురాలు మృతి చెందింది. దీంతో ఆ ప్రాంతంలో నివసించేపేదలకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మంగళగిరి పట్టణంలో వీవర్స్ కాలనీలో గల హై స్కూల్, ఆర్ అండ్ బి బంగ్లా వద్ద గల పాఠశాల, కాంద్రు కమల మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. వీవర్స్ కాలనీలో గల హైస్కూల్లో 30 మంది, ఆర్ అండ్ బి బంగ్లా వద్ద గల పాఠశాలలో 15 మంది మాత్రమే ఉన్నారు. వీళ్ళందరికీ భోజనాలు, టిఫిను, వేడి నీళ్ల సరఫరా చేస్తున్నారు. కాంద్రుకమల పాఠశాలలో ఒకరు కూడా లేరు. రత్నాల చెరువులో ఎక్కువ భాగం ముంపు గురైన భాగం ఉంది. ఇక్కడ మాత్రం పునరావస కేంద్రం ఏర్పాటు చేయలేదు.



వరద బాధితులకు భోజన ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి గ్రామంలో వరద నిర్వాసితులకు స్థానిక సదా వర్తిసత్రంలో జిల్లా కాపునాడు అధ్యక్షులు, టిడిపి నాయకులు పోలిశెట్టి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం భోజనాలు ఏర్పాటు చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని నిర్వాసితులను ఓదార్చి ఆయన చేతుల మీదుగా భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో కాపునాడు నాయకులు పోలిశెట్టి సాయిబాబు, మానూరు రమేష్, తోట ఆనంద్, కోలా రమణ, శీను, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటకు బీమా చేయండి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వేలూరు, పట్టణంలో మానుకుడు వారి పాలెం తదితర గ్రామాలలో పంట వేసిన పొలాలను మండల వ్యవసాయ అధికారి టి శ్రీలత పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్తి, కంది పొలాలను సందర్శించి ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నుంచి పంటలను ఏ విధంగా రక్షించుకోవాలో రైతులకు తెలియజేశారు. ఇ-క్రాప్ నమోదు ఎలా చేసుకోవాలో వివరించారు. తప్పనిసరిగా పంటకు ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు.

పత్తి పైర్లకు పరిశీలన

ప్రజాశక్తి -పెదకూరపాడు

కంభంపాడు, 75 తాళ్లూరు, పెదకూరపాడు గ్రామాలలో అధిక వర్షాలకు గురైన పొలాలను శాస్త్రవేత్తలు ఎస్.రాజమణి, పి.కిషోర్‌వర్మ, సిహెచ్.నాగజ్యోతి సోమవారం పరిశీలించారు. ప్రత్తి పొలంలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించి 13- 0- 45 :10 గ్రాములు లేదా 19- 19-19: 10 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములు మరియు 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలియజేశారు. 90 రోజుల వయసు ఉన్న పొలంలో బూస్టర్ డోస్‌గా 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఒక ఎకరాకు వేసుకోవాలి అని తెలియజేశారు. బోరాక్స్ 1.5 గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలి. ఆకుమచ్చ, బ్యాక్టీరియా తెగుళ్ళ ఆశించే అవకాశం ఉందని, కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ ఒక గ్రాము పది లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.చిన్నబాబు, బి.జ్యోతి, హసన్ బాజీ, టి.పవన్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టామని నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి కెవి.శివప్రసాద్ అన్నారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో మురుగునీరు నిల్వ లేకుండా చేయడంతో పాటు లింగంగుంట్ల, రాజుపాలెం, ఎస్సీ కాలనీలలో పారిశుధ్య పనులు ముమ్మరం చేశామన్నారు.



వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వినాయక చవితి పండగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసేవారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సింగల్ విండో పద్ధతిలో తప్పకుండా అనుమతులు తీసుకోవాలని పల్నాడు జిలా కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పష్టం చేశారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలు పాటించాలని కోరారు. నిర్దేశిత ప్రదేశాల్లోనే నిమజ్జనం చేసుకోవాలన్నారు. నిమజ్జన ప్రదేశాలలో ఉత్సవ నిర్వాహకులు కాకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన సిబ్బంది ద్వారానే నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈత గాళ్ళను, అవసరమైన ప్రాంతాల్లో బోట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశంలో పబ్లిక్ అనౌన్స్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసినచోట విధిగా సి.సి.కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాల విషయంలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. విగ్రహాల రూపులో, పందిర్లలో రాజకీయ గుర్తులు, రంగులు లేకుండా చూసుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు 284 మంది దరఖాస్తు చేసుకొన్నారని తెలిపారు. ఇప్పటివరకు 115 నిమజ్జన ప్రదేశాలను గుర్తించామన్నారు. విగ్రహాల ఎత్తును బట్టి ఊరేగింపు జరిగే విధంగా వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని, ఊరేగింపు సమయంలో ఎదురెదురుగా ఊరేగింపు జరగకుండా చూడాలన్నారు. డిజెసౌండ్ ఎవరికి అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనం రోజున నిమజ్జన ప్రదేశం దగ్గరలోని మద్యం షాపులు మూసివేయిస్తామని చెప్పారు. నిమజ్జన ప్రదేశంలో క్రేన్, గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచాలన్నారు. వరదలు, వర్షాల దష్ట్యా అనువైన నిమజ్జన ప్రదేశాలను 5వ తేదీ నాటికి నిర్ణయిస్తామని చెప్పారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఆర్‌డిఒలు పి.సరోజినీ, రమణకాంత్‌రెడ్డి, పర్యావరణ శాఖ అధికారి నారాయణ, రోడ్లు బవనాల శాఖాధికారి రాజా నాయక్, డిపిఒ భాస్కర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఇఇ ఎస్.శ్రీనివాసరావు, ఎన్ఎస్‌పి ఎస్ఇ వరలక్ష్మి, దేవాదాయ శాఖాధికారి ఆంజనేయులు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఉత్సవాలుండాలి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వినాయక ఉత్సవాలకు ప్రతిఒక్కరూ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, రాజకీయా పార్టీలకతీతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని పట్టణ సిఐ వెంకట్రావ్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. వినాయక ఉత్సవాలు, పూజలు, ఉరేగింపుల వద్ద ఎటువంటి గొడవలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉత్సవ కమిటిదే భాద్యత అని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ విధానంలో అనుమతులు తీసుకోచ్చునని తెలిపారు.ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలసీదార్లు, ఏజెంట్లతో ఎల్ఐసి బలోపేతం



ప్రజాశక్తి - మాచర్ల

ఏజెంట్స్ శ్రమ, పాలసీదారుల సహకారంతోనే ఎల్ఐసి బలోపేతౌమవుతోందని బ్రాంచి మేనేజరు నాగేంద్రబాబు అన్నారు. ఎల్ఐసి 68వ వార్షికోత్సవాన్ని స్థానిక కార్యాలయంలో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెంట్స్ వ్యాపార పురోగతిలో భాగంగా వారు చేస్తున్న కృషి వలన ప్రజల పొదుపుకు ఎల్ఐసి వేదికగా మారి అనేక కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిఓ నాయక్, బిచ్చాలు నాయక్, సత్యనారాయణ, ఏజెంట్లు సిద్ధంరాజు, సూరి, ప్రసాదు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు అవగాహన

ప్రజాశక్తి - కారంపూడి: ఐటిసి, స్వచ్ఛభారత్ గ్రామీణం ఆధ్వర్యంలో క్లాప్ మిత్రాలందరికీ స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో జీవిత బీమా పథకాలపై అవగాహనా సదస్సు సోమవారం నిర్వహించారు. ఐటిసి జిల్లా రిసోర్స్ పర్సన్ బాలయ్య మాట్లాడారు. పటి కుటుంబమూ బీమా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిసి జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ గురు ప్రసాద్, ఎంపిడిఓ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్థానిక పట్టాభిరామస్వామి వారి దేవస్థానం వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం-2024 నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. దీనికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి టిడిపి నాయకులు అత్తులూరి సుబ్బారావు అధ్యక్షత వహించారు. సంఘం నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పెరుమాళ్ళ సత్యనారాయణ, తడికమళ్ళ బాలాంజనేయులు, కోశాధికారి దేవిశెట్టి శ్రీనివాస గుప్తాలచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగసరపు సుబ్బరాయగుప్త, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, డాక్టర్ గార్లపాటి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

జనసేన రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పలుమండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు కేకులు కట్ చేసి పంచిపెట్టారు. కొన్నిచోట్ల రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సహాయ కార్యక్రమాలను చేపట్టారు.



ప్రజాశక్తి - చిలకలూరిపేట

డిప్యూటీసిఎం పవన్‌కల్యాణ్‌కి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గణపవరంలో మండలనేని ఫంక్షన్‌హాల్‌లో ఎమ్.చరణ్‌తేజ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గణపవరంలోని శ్రీకెల్లంపల్లి భద్రాచలం జడ్పీ ఉన్నత పాఠశాల, చిలకలూరిపేట ఎన్టీఆర్‌నగర్‌లో మొక్కలు నాటారు. జెఎస్‌పి నాయకులు పెంటేల బాలాజీ ఆధ్వర్యంలో 52ఎకరాల్లో 1,565 మొక్కలు నాటారు. చిలకలూరిపేటలోని 3 అన్నా క్యాంటీన్లలో అన్నదానం చేశారు.

ప్రజాశక్తి - కారంపూడి

కారంపూడి పట్టణంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే జూలకంటి. బ్రహ్మానంద రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. జనసేన నాయకులు రామాంజనేయులు, కేశానుపల్లి. కృష్ణ, టిడిపి నాయకులు, కర్ణ. అమర సైదారావు, చప్పిడి. రాము పాల్గొన్నారు,

ప్రజాశక్తి - మాచర్ల: నియోజకవర్గంలో జరిగిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయన సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. జూలకంటి గౌతమ్‌రెడ్డి, జూలకంటి అక్కిరెడ్డిల ఆధ్వర్యంలో జమ్మలమడక గ్రామంలో కేక్ కట్ చేసి పలు ప్రాంతాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొమెర దుర్గారావు, నక్షత్రపు ప్రసాద్, పంగులూరి ఆంజయ్యా, పుల్లయ్య, కంభంపాటి అనిల్‌కుమార్, బండ్ల శ్రీనివాసరావు, షేక్ జానిబాబు, మదీన్, లాలా, వినోద్‌రాజు, చైతన్య, రవి పాల్గొన్నారు.



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్: డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని సత్తెనపల్లి తాలూకా సెంటర్లో జనసేన నాయకులు బొర్రా వెంకట అప్పారావు ఘనంగా నిర్వహించారు. దీనికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని బర్త్ డే కేక్ కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. అలాగే లక్ష్మీ టాకీస్ వద్ద ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పిడుగురాళ్ల: డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాలలో జిల్లా సంయుక్త కార్యదర్శి దూదేకుల కాశిం ఆధ్వర్యంలో టిడిపి యువ నాయకులు యరపతినేని నిఖిల్ పాల్గొని మొక్కలను నాటారు. అన్నా క్యాంటీన్లో సొంత ఖర్చులతో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం,రాత్రి బోజనంకు అయ్యే ఖర్చును జనసేన అభిమాని మందా జెస్సి ఆధ్వర్యాన అన్నా క్యాంటీన్‌లో టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి బోజనం ఏర్పాటు చేశారు. జనసేన గురజాల నియోజకవర్గం సమన్వయకర్త కటకం అంకారావు, సంయుక్త కార్యదర్శి దూదేకుల కాశింసైదామండల అధ్యక్షులు కామిశెట్టి రమేష్, వీర మహిళా రమణ , ముక్కంటి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పల్నాడుజిల్లా: నరసరావుపేట నియోజకవర్గంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ జన్మదినవేడుకలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, అనన్య హాస్పిటల్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

ముంపు బాధితులకు ఆపన్నహస్తం

స్వచ్ఛందంగా ఆహారం పంపిణీ చేస్తున్న ప్రజలు



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలం లోని చినకాకాని దీన్ దయాళ్ నగర్ వాసులు గత రెండు రోజులుగా వరద నీటిలో ఉండగా వారికి సిపిఎం ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమాలు లో భాగంగా సోమవారం సాయంత్రం భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు భోజనాలు పంపిణీ చేశారు. ఆనంతరం మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికి దీన్ దయాల్ నగర్ నీటితో నిండిపోతున్నదని దీనికి శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి .బాబు వరప్రసాద్, వి పూర్ణయ్య పలగాని రాంబాబు, కాజ సాంబ శివరావు, కాజ రామారావు మైలా శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు :మండల తెలుగు యువత ఆధ్వర్యంలో వరదల వల్ల నిరాశ్రయులయులైన వారికి ఆహార పొట్లాలు అందజేశారు. రాయపూడి,హరిశ్చంద్ర పురంలో వరద బాధితులకు మండల తెలుగు యువత అధ్యక్షులు మూల్పూరి నరేష్, కార్యకర్తలతో కలిసి ఆహార పొట్లాలు అందించారు .బాధితులకు అండగా ఉంటామని నరేష్ చెప్పారు.

ప్రజాశక్తి - చేబ్రోలు : భారీ వర్షాలతో దెబ్బతిన్న మూడు పూరిళ్ల కుటుంబాలకు రూ.5వేలు చొప్పున, 16 కుటుంబాలకు నిత్యావసరాలు ప్రెసిడెన్సి హై స్కూల్ డైరెక్టర్ బన్ బాబు వాసిరెడ్డి ఆర్థిక సహకారంతో స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ వారికి అందజేశారు. సోమవారం చేబ్రోలు మండలం గొల్లపాలెం ఏరియా , నారాకోడూరు గ్రామ పరిధిలో నీట మునిగిన పొలాలను,ఇళ్లను ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మైలా వెంకట రామరాజు , అనంత లక్ష్మి నారాయణ , జనసేన నాయకులు చందు శ్రీరాములు ,మాజీ ఎం పి పి ఖాదర్ భాషా పాల్గొనినారు.

5వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లి :మహానాడు వరద బాధితులకు అన్నదానం చేస్తున్న పురాణం వెంకటాచార్యులుకృష్ణానది వరద ముంపునకు గురైన మహానాడు ప్రాంతంలోని వరద బాధితులకు త్రిదండి చిన్న జీయర్ స్వామి, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వికాస తరంగిణి సంయుక్తంగా సహకారంతో సోమవారం మహానాడు ప్రాంతంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో 5000 వేల మందికి ఫలహారం అన్నదానం నిర్వహించారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి భోజనం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా సీతానగరం, మహానాడు ప్రాంతంలోని వరద బాధితులకు ఉదయం బాల భోగం, మధ్యాహ్నం భోజనం,సాయంత్రం అందించినట్లు తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల పరిశీలన



ప్రజాశక్తి - కొల్లిపర

ప్రకాశం బ్యారేజ్ నుంచి సోమవారం ఉదయం 11 లక్షల 35వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేయడంతో కొల్లిపర మండల కరకట్ట వెంబటి గ్రామాలైన అత్తలూరి వారి పాలెం వల్లభాపురం మున్నంగి పిడపర్తి పాలెం కొత్త బొమ్మువానిపాలెం హనుమాన్ పాలెం అన్నవరం గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు అలానే మండలంలోని లంక గ్రామాలైన పాత బొమ్మువానిపాలెం పొట్టి దెబ్బలంక కొత్తూరు లంక అన్నవరపు లంక గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి ఆయా గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు హనుమాన్ పాలెం తోములూరు పాఠశాలలో పునరావస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. జెసి భార్గవ్ తేజ తాసిల్దార్ సిద్ధార్థ ఎంపీడీవో విజయలక్ష్మి తెనాలి ఆర్ డి ఓ ఎప్పటికప్పుడు వరదపరిస్థితిని సమీక్షిస్తున్నారు అధికారులకు సూచనలు సలహాలు సూచిస్తున్నారు లంక గ్రామమైన పాత బొమ్మువానిపాలెం పూర్తిగా వరద నీరు చేరటంతో ఆ గ్రామ రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు వరదల కారణంగా నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరానికి లక్ష రూపాయలు మాగాణి వరి పైరుకు రూ 25000 నష్టపరిహారాన్ని ప్రభుత్వం వెంటనే అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భవన్ నారాయణ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొలక శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లిపర మండలంలోని కరకట్ట వెంబడి ఉన్న గ్రామాలను సాయంత్రం పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ తో కలిసి పర్యవేక్షించారు ఈ సందర్భంగా పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లను తెలుసుకున్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : గత నాలుగు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు కష్ణా నది వరద ఉధృతంగా ప్రవహించడంతో , కృష్ణానది పరివాహక ప్రాంత కరకట్ట వాసులను కలుసుకునేందుకు టిడిపి రాష్ట్ర నాయకులు వంగవీటి రాధా, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు ఉదయం ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో పర్యటించారు. ముంపు ప్రాంత కరకట్ట వాసులను కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశీలన కార్యక్రమంలో టిడిపి ప్రాతూరు గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





ప్రజాశక్తి మంగళగిరి

భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన చేనేత కార్మిక కుటుంబాలను, మగ్గాల షెడ్డులను, చేనేత సహకార సంఘాలను సోమవారం చేనేత జౌళి శాఖ ఉన్నతాది కారులు మంగళగిరి చేనేత వాడల్లో పరిశీలించారు. భారీ వర్షాల వలన నష్టపోయిన వారిని ఆదుకోవడానికి మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఈ బృందం పర్యటిం చినట్లుగా తెలిసింది. మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు, పాత మంగళగిరి, హుస్సేన్ కట్ట వద్ద ఉన్న మగ్గాల షెడ్లను సందర్శించారు. మగ్గాల గుంటల్లోకి నీళ్లు రావడం వలన పనులు కోల్పోయిన చేనేత కార్మికుల గురించి అడిగి తెలుసుకున్నారు. మగ్గాల షెడ్లు పాడైపోవడం, నూలు తడిచిపోవడం వంటి వాటిని పరిశీలించారు. మంగళగిరి నియోజకవర్గంలోని ఉన్న చేనేత వాడలను పరిశీలించడం కూడా జరిగిందని తెలిపారు. ఈ మేరకు నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి పంపి బాధితులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ చేనేత జోలి శాఖ ముఖ్య కార్యదర్శి కే సునీత, కమిషనర్ రేఖ రాణి, అదనపు సంచాలకులు కే కన్నబాబు, గుంటూరు జిల్లా సహాయ సహాయకులు వనజ కుమారి, స్థానిక టిడిపి నాయకులు దామర్ల రాజు, కారంపూడి అంకమ్మరావు, పి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నదిలో కొట్టుకుపోయిన 200 గేదెలు

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల పరిధిలోని కష్ణానది పరివాహక ప్రాంతంలో కష్ణా నదికి వరద ఉధృతి పెరిగింది. దీంతో రాయపూడి పెద్దలంకలో నివాసం ఉంటున్న సుమారు 200 కుటుంబాలను కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలోని పునరావాస కేంద్రానికి తరలించారు. ఇళ్ల వద్ద ఎవరూ లేకపోవడంతో పశువులకు ఆలనా పాలన లేకుండా పోయింది. కృష్ణానది వరద ఉధృతి పెరగడంతో సుమారు 200 గేదెలు నదిలో కొట్టుకుపోయాయని లంకవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కొంతమంది పశుయజమానులు ఈతగాళ్లు, అధికారుల సాయంతో కొన్ని గేదెలను రక్షించ గలిగారు. తుళ్లూరు మండలంలో ఐదు లంకల్లో ప్రజలు నివాసం ఉంటున్నారు. రాయపూడి పెదలంక, ఉద్దండరాయు నిపాలెం, తాళ్లాయపాలెం, వెంకటపాలెం హరిశ్చంద్రపురం గ్రామాల లంకల్లో ఉన్న వారిని అధికారులు సహాయక శిబిరాలకు తరలించారు.ఆయా గ్రామాల్లో పశువుల తరలింపు ఇబ్బందికరంగా మారింది.రాయపూడి పెదలంక మినహా మిగిలిన చోట్ల పశువులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఉద్దండరాయునిపాలెం లంక నుంచి టిడిపి నేత పులి చిన్నా సహకారంతో పోలీసులు,సిబ్బంది పశువులను తరలించారు.



ముగ్గుర్ని కాపాడిన అధికారులు

ప్రజాశక్తి - తుళ్లూరు

కృష్ణానదిలోని ఓ ద్వీపంలో చిక్కుకున్న ముగ్గురిని అధికారులు రక్షించారు. వెంకటపాలెం దళితవాడకు చెందిన అన్నూరి జక్రయ్య సహకారంతో వెంకటపాలెం లోని మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమంకు సంబంధించి ఒక ద్వీపంలోని మామిడితోటలో కృష్ణా జిల్లా, ఏటూరుకు చెందిన పొట్లూరి సుబ్బారావు, పొట్లూరి శాంతి, పొట్లూరి సౌజన్య లను కాపాడారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామ లంక పొలాలలో కృష్ణానది ఉదతంగా ప్రవహించడంతో పాడి పశు వులు లంక పొలాలలో వుండి పోయాయి. చిక్కుకున్న పాడి పశువులను ఒడ్డుకు చేర్చాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు టిడిపి గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావును కోరారు. స్పందించిన శ్రీనివాసరావు తన సొంత ఖర్చులతో వల్లభాపురం నుండి బోటు పడవలను తెప్పించి, లంక పొలాలలో చిక్కుకున్న గేదెలను ఒడ్డుకు చేరవేశారు. దీంతో గ్రామంలోని రైతులు శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అల్పపీడనం కారణంగా పంట నష్టపోయిన రైతులు ముందుగా పొలాల్లో నిలిచిన నీటిని బయటకు తరలించే ప్రయత్నాలు చేపట్టాలని లామ్ ఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ వి ఎస్ గోపాలస్వామి అన్నారు. సోమవారం తెనాలి మండలం హాఫ్ పేట, పెదరావూరు, సంఘం జాగర్లమూడి గ్రామాల్లో నీటమునిగిన పొలాలను మండల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్ ఉషారాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ ఐ ఉషారాణి తో కలసి పరిశీలించారు. అనంతరం గోపాలకష్ణ మాట్లాడుతూ వీలైనంత త్వరగా పొలాల్లో నిలిచిన నీటిని బయటకు తరలించాలని రైతులకు సూచించారు. క్రమంగా నీరు తరలించిన అనంతరం యూరియా లేదా పొటాషియం మందులను చల్లాలన్నారు. వరికి తెగుళ్ల రాకుండా కార్బెన్డైజమ్ మిశ్రమాన్ని పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తెనాలి ఏఓ జి ప్రేమ సాగర్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి, పెదనందిపాడు

భారీ వర్షాలతో ముంపునకు గురైన పత్తి, వరి పంట పొలాలను సోమవారం పమిడివారిపాలెం లో మండల వ్యవసాయ అధికారిని బి సుధారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వారితో మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ప్రజా సంక్షేమమే పవన్ కళ్యాణ్ ధ్యేయం

జిల్లాలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు - పలు చోట్ల రక్తదానం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ధ్యేయమని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. సోమవారం స్థానిక అరండల్ పేటలోని వేదసీడ్స్ కార్యాలయంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్‌తో కలసి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమరావతి రోడ్డులోని సత్రంలో జి. కుమార్, కె.అనిల్, ప్రదీప్ ఆధ్వర్యంలో పవన్ చిత్ర పటానికి పాలాభిషేకం, వద్ధులకు, చిన్నారులకు పండ్లను పంపిణీ చేసి స్థానికులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని తులసి ధర్మచరణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో తోట రంగారావు, పి.ఉదయ్‌రాజ్, టి. వెంకట్రావు, జి. సాయిరాం, కె.రవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఎఎన్‌యు

పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలును ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ముఖ ద్వారం వద్ద కూటమి ఉద్యోగ మరియు విద్యార్థి సంఘ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు అర్బన్ బ్యాంకు చైర్మన్ బోనబోయిన శ్రీనివాస యాదవ్ పాల్గొని పవన్ కళ్యాణ్ 56 వ జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి భారీ కేక్ ను కట్ చేసి పంచారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక సుల్తానాబాద్ లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సుల్తానాబాద్ వడ్డెర కాలనీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెనాలి గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, అంగలకుదురు గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం పాల్గొని పవన్ కళ్యాణ్ జన్మదిన కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అనీల్, వెంకట్, వెంకట్రావు, మెట్రో యుగంధర్, శంకర్ నాయక్, సిద్ధాంతి శ్రీనివాసరావు మహేష్ నాయక్, హనుమాన్ నాయక్, పేరయ్య, దుర్గాప్రసాద్, వెంకట్రావు, సత్యనారాయణ, పోతురాజు కిషోర్ పాల్గొన్నారు .కొలకలూరు గ్రామ పురవేదిక వద్ద జనసేన నాయకులు తోట నరేంద్ర ఆధ్వర్యంలో సుమారు 30 మందికి పైగా రక్తదానంచేశారు.

ప్రజాశక్తి-తెనాలి

పచ్చదనం పరిశుభ్రత కోసం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటేకార్యక్రమంలో మనోహర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెనాలి-చందోలు నాలుగు లైన్ల రోడ్డులో డివైడర్లపై ఆయన మొక్కలు నాటారు

ప్రజాశక్తి - మంగళగిరి

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం మంగళగిరి పట్టణంలో గల సిఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో మెగా రక్తదాన శిబిరం జరిగింది. పలువురు యువకులు రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చల్లపల్లి శ్రీనివాసరావు, మునగపాటి వెంకట మారుతీ రావు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



విధుల్లోకి తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ

ప్రజాశక్తి-తెనాలి


తెనాలి సబ్ కలెక్టర్‌గా ఐఎఎస్ అధికారి వి.సంజనా సింహ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తాజాగా శిక్షణ పూర్తి చేసిన ఎనిమిది మంది ఐఎఎస్‌లకు ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చిన సంగతి తెలసిందే. వారిలో సంజనా సింహను తెనాలి సబ్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమిస్తూ జారే చేసిన ఉత్తర్వుల మేరకు ఆమె బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ప్రఖర్ జైన్ ను తొలుత ఐటిడిఎకు, తదుపరి మరో ప్రాంతానికి జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసిన సంగతి తెలి సిందే. బాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన సబ్ కలెక్టర్‌ను కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న సంజనా సింహ

జిఎంసి గ్రీవెన్స్‌కు 41 ఫిర్యాదులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇస్తున్న ఆర్జీలను క్షేత్ర స్థాయి అధికారులు నేరుగా పరిశీలించి, అర్జీలు పునరావతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల అర్జీలు స్వీకరించారు. మొత్తం 41 ఫిర్యాదులు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 21, ఇంజినీరింగ్ విభాగం 9, రెవెన్యూ విభాగం 1, ప్రజారోగ్య విభాగం 5, అకౌంట్స్ విభాగంకి సంబందించి 2, ఉపా సెల్‌కి సంబందించి 2, ఎడ్యుకేషన్ 1 ఫిర్యాదు అందాయన్నారు. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, వెంకట లక్ష్మీ, టి.వెంకట కష్ణయ్య, ఎస్ఈ శ్యాం సుందర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.


కిమషనర్‌కు అర్జీ ఇస్తున్న కె నళినీకాంత్ తదితరులు

పటిష్టమైన డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి : సిపిఎం

నగరంలో పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ముంపు సమస్య పునరావృతం కాకుండా చూడాలని సిపిఎం నగర కార్యదర్శి కె. నళినీకాంత్ కోరారు. సోమవారం గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు సిపిఎం నాయకులు ముంపు సమస్యలపై అర్జీ అందచేశారు. నళినీకాంత్ మాట్లాడుతూ బి.ఆర్.స్టేడియంకు గతంలో మెరక తోలుతూ ప్రక్కనే ఉన్న శ్రామికనగర్ కాలువను పూడ్చారని, దీనితో వర్షపు నీరు వెళ్ళే మార్గం లేక, ఇళ్లలోకి నీరు వస్తున్నాయన్నారు. శాశ్వతంగా కాలువ నిర్మాణం చేయాలని కోరారు. చంద్రయ్య నగర్‌లో చెరువు కట్ట తెగటం వల్ల ఇళ్ళలోకి నీరు వచ్చిందని, పాములు, తేళ్ళు వంటి విషపురుగులతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలియచేశారు. యన్.జి.జి.ఒ కాలనీలోని కోనబాల ప్రభాకరరావు మున్సిపల్ హైస్కూల్‌లో చిన్న వర్షానికే నీరు నిలబడుతుందన్నారు. స్వర్ణాంధ్ర నగర్ వద్ద వర్షపు నీరు ప్రవాహ ఉదతికి మెయిన్ కాలువకు కట్టిన గోడ విరిగిపోయిందని, దీనిని వెంటనే రిపేరు చేయాలని, లేకపోతే తీవ్రమైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలియచేశారు. కమిషనర్ స్పందిస్తూ శ్రామికనగర్‌లో వర్షపు నీరు తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. చంద్రయ్యనగర్‌లోనూ వర్షపు నీరు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిపియం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, జిల్లా కమిటి సభ్యులు ఎల్. అరుణ, నగర నాయకులు షేక్ ఖాశీం షహీద్, టి. శ్రీనివాసరావు, కృష్ణకుమారి, శ్రామికనగర్ ప్రజలు, చంద్రయ్యనగర్ ప్రజలు పాల్గొన్నారు.

నేడూ కాలేజీలు, పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లాలో వరదలు, పాఠశాలల ప్రాంగణాలలో వర్షపు నీరు ఉండటంతో జిల్లాలోని అన్ని జూనియర్ కాలేజిలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు మేనేజ్‌మెంట్స్ ఆధ్వర్యంలోని విద్యా సంస్థలు అన్నింటికీ ఈ ఆదేశాలు వర్తిస్తాయన్నారు.

చలపతి అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.ప్రవీణకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ తెలియజేశారు. ప్రవీణ 'ఇన్వెస్టిగేషన్స్ ఆన్ సిరీస్ సింథటిక్ అపెర్చర్ రాడార్ అప్లికేషన్స్' అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట కిషోర్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ ఇసిఇ హెచ్ఒడి డాక్టర్ కె.వెంకట రామారావు, డీన్ జె.లక్ష్మీనారాయణ ప్రవీణకు అభినందనలు తెలిపారు.


పిహెచ్‌డి పట్టా అందుకుంటున్న ప్రవీణ

ఊరంతా కన్నీరే

- సుందరయ్యనగర్, మహానాడు జలదిగ్బంధనం
- గజగజ వణుకుతున్న స్థానికులు
- సిపిఎం, పలువురు సహాయక చర్యలు

ప్రజాశక్తి - తాడేపల్లి

వరద కృష్ణమ్మ కన్నెర్రజేసింది. ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మహానాడు, సుందరయ్యనగర్ ఇళ్లల్లోకి ఐదడుగుల మేర వరద నీరు చేరింది. దీంతో స్థానికులు కొద్దిపాటి చేతికందిన సామాన్లు తీసుకుని ప్రాణాలతో బయటపడ్డారు. మునకకు గురైన ప్రాంతంలో సుమారు ఏడు వేల మంది నివాసం ఉంటున్నారు. ఇక్కడ 23 బజార్లలో ఎక్కడ చూసినా వరద నీరే దర్శనమిస్తుంది. ప్రజలు రాకపోకలు సాగించడానికి కూడా వీల్లేకుండా పోయింది. అందరూ డాబాల పైకి ఎక్కి సురక్షితంగా ఉండగలిగారు. గత 35 ఏళ్లలో కృష్ణానది ఇంత పెద్దఎత్తున ప్రమాద ఘంటికలు మోగించలేదని పెద్దలు చెబుతున్నారు. సీతానగరం పుష్కర ఘాట్ల పైకి వరద నీరు పెద్దఎత్తున వచ్చి చేరింది. రైల్వే బ్రిడ్జిని తాకడానికి అడుగు దూరంలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. పైనుంచి వస్తున్న వరదకు కృష్ణానదిలో నుంచి నాలుగు ఇసుక బోట్లు కొట్టుకువచ్చాయి. దీంతో బ్యారేజీ 78వ ఫిల్లర్ కొంత దెబ్బతింది. పాదచారులతో పాటు ద్విచక్ర వాహనదారులు ఎవ్వరినీ ప్రకాశం బ్యారేజీ అనుమతించలేదు. 24 గంటలు రాకపోకలను పూర్తిగా నిలిపివేసినట్లు తాడేపల్లి సిఐ కల్యాణరాజు, మంగళగిరి సిఐ వినోద్‌కుమార్ ప్రకటించారు.

ఉండవల్లి సెంటర్ నుంచి ట్రాఫిక్‌ను బైపాస్ వైపు మళ్లించడంతో వారధిపై గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. సుందరయ్యనగర్‌లోని లీలా సుందరయ్య కళావేదిక వరద నీటిలో చిక్కుకుపోయింది. ఇక్కడ ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రం నడుస్తుంది. కంప్యూటర్ శిక్షణా కేంద్రంలోకి వరద నీరు రావడాన్ని గమనించిన ప్రజాశక్తి సిజిఎం వై.అచ్యుతరావు, విజ్ఞాన కేంద్రాల బాధ్యులు పి.మురళీకృష్ణ, ఎస్.వెంకట్రావు, బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, రామకృష్ణారెడ్డి, సుమ, కొండబాబు తదితరులు అక్కడున్న రూ.2 లక్షలు విలువ చేసే కంప్యూటర్ సామాగ్రిని సురక్షితంగా తరలించారు. సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు మధ్యాహ్నం, సాయంత్రం బాధితులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఉదయం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్థానికులు ఎక్కడికక్కడే రెండు కిలోమీటర్ల పొడవునా సుందరయ్యనగర్ కట్ట మీద తమకు తోచిన విధంగా అల్పాహారం ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం కూడా సిపిఎం ఆధ్వర్యంలో బాధితులకు భోజన వసతి కల్పించారు. బాధితులకు అండగా నిలబడి భోజన ఏర్పాటు చేయడంలో స్థానిక నాయకులు నారిన నాగేశ్వరరావు, రామారావు, ఎస్‌కె బాష, నాని, పి.రామచంద్రరావు, బి.శేఖర్, బూరుగ వెంకటేశ్వర్లు, దుర్గారావు, వై.బర్నబస్, ఎం.శ్రీనివాసరెడ్డి, డివి భాస్కరరెడ్డి, ఎల్.సత్యం, కె.గడ్డన్న, రాజు తదితరులు పాల్గొన్నారు. కృష్ణానది మునుపెన్నడూ లేని విధంగా ఉగ్రరూపం దాల్చడంతో బ్యారేజీపై రాకపోకలు బంద్ చేశారు. ఉండవల్లి సెంటర్, అమరావతి కరకట్ట రోడ్డు, ప్రకాశం బ్యారేజీ వైపు ఎవరినీ వెళ్లనీయకుండా పోలీసులు కట్టుదిట్టం చేశారు. మహానాడు, సుందరయ్యనగర్, ప్రకాశం బ్యారేజీ తదితర ప్రాంతాల్లో నలుగురు సిఐలు, పది మంది ఎస్ఐలు, వందలాది మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. సుందరయ్యనగర్‌లోని ఓ ఇంట్లో పసిపాపతో సహా ఓ కుటుంబం వరద నీటిలో చిక్కుకుని బయటకు రాలేక పోవడంతో మంగళగిరి సిఐ వినోద్‌కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, పసిబిడ్డతో సహా ఆ కుటుంబాన్ని ఒడ్డుకు చేర్చారు. మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సుందరయ్యనగర్, మహానాడు ప్రాంతాల్లో సుమారు పది వేల మంది వరద నీటిలో చిక్కుకుపోవడంతో తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎం.అనూష్, పి.శాంతకుమారి తమ సిబ్బందితో తాత్కాలిక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.

సేవకు ముందుకొచ్చిన మణిపాల్ ఆసుపత్రి

తమ ఆసుపత్రి సమీపంలోనే వరదలు ముంచెత్తడంతో మణిపాల్ ఆసుపత్రి యాజమాన్యం సేవకు ముందకొచ్చింది. వైద్య సేవలతో పాటు బాధితులకు పలు ప్రాంతాల్లో డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యలంఓ ఆహార పంపిణీ చేపట్టింది.పోతురాజుస్వామి గుడి వద్ద వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి సహకారంతో భోజనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి టి.వెంకటయ్య, ఎస్‌సి సెల్ పట్టణ అధ్యక్షులు ఎం.ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

సుందరయ్యనగర్, మహానాడు ప్రాంతాల్లో పెద్దఎత్తున వరద పోటెత్తి వేలాది మంది నిరాశ్రయులు కావడంతో దయనీయమైన పరిస్థితి ఇక్కడ నెలకొని ఉందని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సహాయక శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వరద ముంచెత్తిన ప్రాంతాల్లో సిపిఎం నాయకులతో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. వరద నీటిలో దిగి బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టుబట్టలతో బయటకు వచ్చిన బాధితులకు భోజనంతో పాటు అల్పాహారం ఏర్పాటు చేసి అన్ని వసతులతో కూడిన సహాయక శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 8 వేల మంది నిరాశ్రయులయ్యారని, అధికారులు వెంటనే నష్టపరిహారాన్ని అంచనా వేసి ఆదుకోవాలన్నారు. ఇళ్లు ఖాళీ చేసి అనేకమంది బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఆశ్రయం పొందుతున్న పరిస్థితి ఉందని చెప్పారు. వరద నీటిలో కిందకు రాలేక వందలాది కుటుంబాలు డాబా పైఅంతస్తులోనే ఉన్నట్లు తాము గుర్తించినట్లు చెప్పారు. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికులకు తక్షణ సాయం కింద నిత్యావసరాలు, కొంత నగదు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో వాణిజ్య పంటలు నీటమునిగాయని, రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. వరద నీరు తగ్గిన తరువాత అంటువ్యాధులు ప్రబలకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, పట్టణ, రూరల్ కార్యదర్శులు బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకట రెడ్డి, వేముల దుర్గారావు, డి.విజయబాబు, ఎం.శ్రీనివాసరెడ్డి, డివి భాస్కరరెడ్డి, నారిన నాగేశ్వరరావు, బొబ్బిలి రామారావు, వై.బర్నబస్, రామచంద్రరావు, ఎల్.సత్యం తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లి మహానాడు, సుందరయ్య నగర్‌లో నీటమునిగిన ఇళ్లు



బ్యారేజీ వద్దకు కొట్టుకు వచ్చిన ఇసుక బోట్లు


వరద నుండి చిన్నారిని కాపాడిన పోలీసులు


కంప్యూటర్‌లను తెస్తున్న సిపిఎం శ్రేణులు


సిపిఎం ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ చేస్తున్న కార్యకర్తలు





మణిపాల్ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు